జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
సోమవారం | 8 | జూన్ | 2026 ◆ పేజీలు : 4



# విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రజా ప్రభుత్వం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- లక్ష్మీపురం గురుకుల విద్యాలయ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలి
- విద్యపై పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్ తరాల కోసం చేసే పెట్టుబడి
- బోనకల్ మండలం లక్ష్మీపురంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల భవన నిర్మాణ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం

2 లో...



- విద్యుత్ డిమాండ్ పెరిగినా రాష్ట్రంలో ఎక్కడా కోతలు లేవు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరిన్ని ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధం
- 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తే లక్ష్యం
- ప్రత్యేక రైతు డిస్కం ద్వారా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగింపు
- రాష్ట్రంలో 85 గ్రామాలను సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తాం... గిరిజనుల భూములకు సోలార్ పంప్ సెట్ ఏర్పాటు
- ఖమ్మం పాకబండలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి, మంత్రి తుమ్మల




## పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా

# మౌలిక వసతుల విస్తరణ

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో మౌళిక వసతులను నిరంతరం విస్తరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఆదివారం ఖమ్మం నగరంలోని పాకబండ వద్ద నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎన్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యుత్ ఉపకేంద్రంలోని కంట్రోల్ రూమ్,ఆధునిక పరికరాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రికి అధికారులు సాంకేతిక వివరాలను వివరించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఉపకేంద్రాన్ని నిర్మించడం జరిగిందని, కంట్రోల్ రూమ్ నుంచే నిర్వహించే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ఖమ్మం జిల్లాలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ వ్యవసాయం,పరిశ్రమలు, గృహ అవసరాలు సహా అన్ని రంగాలకు ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు.2023లో రాష్ట్ర పీక్ డిమాండ్ 15 వేల మెగావాట్లు ఉండగా ప్రస్తుతం 18,548 మెగావాట్లకు పెరిగిందన్నారు.మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ,పరిశ్రమలు, ఫార్మా సిటీ,డేటా సెంటర్లు, వ్యవసాయ రంగ విస్తరణ వంటి కారణాలతో భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు మరింత పెరుగుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని

మిగతా 2 లో...

# ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి



- సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్
- కల్లూరు డివిజన్‌లో బి ఎల్ వో ల శిక్షణను పరిశీలించిన సబ్-కలెక్టర్

2 లో...

# జూన్ 10లోగా ఓటరు జాబితా అనామలీస్ లను పూర్తిగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై క్షేత్ర స్థాయిలో ప్రత్యేక దృష్టి
- అనామలీస్ ల సవరణకు బీఎల్ఓలు ఇంటింటి పరిశీలన తప్పనిసరి



రఘునాధపాలెం ప్రజా జ్యోతి రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామంలో, ఖమ్మం నగరంలో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) మ్యాపింగ్ లో అనామలీస్ ల సవరణకు బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో ఇంటింటి పరిశీలన తప్పనిసరి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. రఘునాథ పాలెం మండలంలోని కోటపాడు గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆనతరం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో

మిగతా 2 లో...

## ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి

**కల్లూరు జూన్ 07 : ప్రజా జ్యోతి** కల్లూరు డివిజన్ పరిధిలోని కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో నిర్వహించిన బూత్ లెవల్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్ ఆదివారం సందర్శించి సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక తీవ్ర సవరణ కార్యక్రమం (ఎస్ ఐ ఆర్-2026)లో భాగంగా పెండింగ్‌లో ఉన్న జీరో అనామలీస్ జాబితాను అత్యవసరంగా పరిశీలించాలని బి ఎల్ ఓ లను ఆదేశించారు. ఎటువంటి ఆలస్యం లేకుండా పూర్తి స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి 100 శాతం ఖచ్చితత్వంతో పని చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోపు అన్ని అనామలీలను క్లియర్ చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాల స్వచ్ఛత, పారదర్శకత మరియు నాణ్యతను కాపాడేందుకు బి ఎల్ వో లు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సబ్-కలెక్టర్ సూచించారు.

## జూన్ 10లోగా ఓటరు జాబితా అనామలీస్ లను పూర్తిగా పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి...)



కలిసి కలెక్టర్ ఖమ్మం నగరంలో రెండవ డివిజన్ పాండుర ంగాపుర ంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో 2002 ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో నమోదైన ఓటర్లు, వారి వారసులు, కుటుంబ సభ్యులను ప్రస్తుత ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో గుర్తించిన అనామలీస్ లను వెంటనే సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు జూన్ 10లోగా ఓటరు జాబితా అనామలీస్ లను పూర్తిగా పరిష్కరించాలని, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై క్షేత్ర స్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవగహన కల్పిస్తూ సరైన వారి తండ్రి, తల్లి, నాన్నమ్మ, తాతయ్య ఓటర్ల కార్డులతో మ్యాపింగ్ చేయాలని సూచించారు. అనామలీస్ ల సవరణకు బీఎల్ఓలు ఇంటింటి పరిశీలన తప్పనిసరి చేయాలని, సూపర్వైజర్, అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 25 నుంచి జులై 24 వరకు నిర్వహిస్తామని, డబుల్ ఓట్లు, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ బోధనకు ఇన్‌స్ట్రక్టర్, ఆయాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** రఘునాథపాలెం మండలంలోని ఐదు పాఠశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి గాను పూర్వప్రాథమిక తరగతుల నిర్వహణకు అనుమతులు వచ్చినట్లు ఎంఈవో బి . రాములు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఆయా పాఠశాలల్లో ఒక ప్రీ ప్రైమరీ ఇన్ స్ట్రక్టర్ , ఒక ఆయా పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. యూపీఎస్ చింతగుర్తి, యూపీఎస్ గణేశ్వరం, పిఎస్ చిమ్మపుడి, పిఎస్ మంచుకొండ , యూ పి ఎస్ రాంక్యాతండ పాఠశాలల్లో ప్రీప్రైమరీ బోధనకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ ఆపైన అర్హత ఉండాలని, ఆయా పోస్టుకు 7 తరగతి ఆపైన ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు నెలకు రూ.8,000, ఆయా పోస్టుకు రూ.6,000 గౌరవ వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత హాబిటేషన్, గ్రామం లేదా మండలానికి చెందిన వారై ఉండాలని, 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని మండల విద్యాధికారి వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ జూన్ 8 నుంచి 9 వరకు జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు రఘునాథపాలెం మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ






(మొదటి పేజీ తరువాయి...)

ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి 2030 నాటికి 20 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని 85 గ్రామాలను పూర్తి స్థాయి సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బోనకల్ మండలంలో సోలార్ ఆధారిత విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గిరిజనుల భూముల సాగుదారులకు ఇందిరా గిరి జల వికాస పథకం క్రింద సుమారు 6 లక్షల ఎకరాలకు సోలార్ పంపుసెట్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు 3,500 మెగావాట్ల మేర డిమాండ్ పెరిగినా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు విధించలేదన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత పరిస్థితులు ఉన్నప్పటికీ తెలంగాణలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అవసరమైన మేరకు కొత్త విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపితే వెంటనే పరిశీలించి మంజూరు చేస్తామని చెప్పారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతుందని, రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం ప్రతి నెల 1150 కోట్ల భారీ మొత్తంలో సబ్సిడీ అందిస్తోందన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక రైతు డిస్కం ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉచిత విద్యుత్‌పై జరుగుతున్న దుష్ప్రచారాలను రైతులు నమ్మవద్దని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా లూజ్ వైర్లను వెంటనే బిగించే చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ శాఖ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించామని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరిన్ని ఉపకేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను బలోపేతం చేయాలని అధికారులను సూచించారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్లు, భవనాలు, విద్యుత్, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తే అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తవుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో ఖాళీగా ఉన్న భూముల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడు తూ ఖమ్మం నగరంలో విద్యుత్ వినియోగం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ 30 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ మౌళిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నగరంలో మరో ఐదు విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపును వారం రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఎన్పిడిసియల్ ఎస్ఈ శ్రీనివాస చారి, మాజీ మేయర్ పూనుకొల్లు నీరజ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రజా ప్రభుత్వం





**బోనకల్, జూన్ 07(ప్రజా జ్యోతి):** అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం చేపట్టిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాలయ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., సంబంధిత శాఖల అధికారులు డిప్యూటీ సీఎం భట్టికి నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి విద్యాలయ ఆవరణలో కాలినడకన తిరుగుతూ పరిపాలనా భవనం, జూనియర్, సీనియర్ హాస్టళ్లు, తరగతి గదులు, ల్యాబ్ గదుల నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... విద్యకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి వ్యయం కాదని, భవిష్యత్ తరాలను శక్తివంతంగా తీర్చిదిద్దే పెట్టుబడి అని అన్నారు. దేశంలోనే అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని ప్రభుత్వ విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతూ నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా అత్యున్నత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్‌కు పునాదిగా నిలిచే ఈ విద్యాసంస్థ నిర్మాణంలో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. పనుల పురోగతిపై అధికారులు పరిపాలనా భవనానికి సంబంధించిన బ్లాక్-2, 3, 4 ల్యాబ్ భవనాల జీ ప్లస్ వన్ స్లాబ్ పనులు పూర్తయ్యాయని, బ్లాక్-4 తరగతి గదుల జీ ప్లస్ టూ స్లాబ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. సీనియర్ హాస్టళ్లలో ఒక బ్లాక్‌లో గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ పనులుకొనసాగుతుండగా, మూడు బ్లాక్‌ల పునాది పనులు పూర్తయ్యా యని వివరించారు. జూనియర్ హాస్టళ్లలో రెండు బ్లాక్‌ల నిర్మాణ పనులు పూర్తి కాగా, మరో రెండు బ్లాక్‌ల పునాది పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, బోనకల్ తహసిల్దార్ చల్లూరి సుధాకర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు

- జిల్లా అధ్యక్షు, కార్యద ర్శులు నానబాల రామ కృష్ణ,అర్వపల్లి నగేష్







**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** తెలంగాణ జర్నలిస్టు ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ నాయకుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తొలి రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య 61వ జన్మదిన వేడుక స్థానిక ఖమ్మం నగరంలో గల అన్నం ఫౌండేషన్ అనాధ శరణాలయంలో కేక్ కట్ కటింగ్ జరిగింది. అనంతరం,పండ్లు పంచుతూ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు ఖమ్మం జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుపుకోవడం జరిగింది అనంతరం శ్రీ కుసుమా రియల్ ఎస్టేట్ గార్డెన్ లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి సోమయ్య పేరు మీద శివుడికి ఇష్టమైన కదంబ చెట్టును నాటడం జరిగింది అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ మాట్లాడుతూ, సోమయ్య ప్రస్థానం ఉమ్మడి నల్గొండ జిల్లా గా ఉన్నప్పుడు మొదలై ఇప్పుడు ప్రస్తుతం సూర్యాపేట జిల్లా గా మార్పు చెందింది. ఆనాడు నల్లగొండ జిల్లా లోని సూర్యాపేట కు చెందిన,సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సోమయ్య, హైదరాబాద్‌లో పీ.జీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసి,జర్నలిజాన్ని సామాజిక సేవా సాధనంగా మల్చుకున్నారు.

ఉద్యమ ప్రస్థానం

2008లో 1300 మంది సభ్యులతో కూడిన గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీని స్థాపించారు. 2009లో హైదరాబాద్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

సంస్థల నిర్మాణం

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పాత్రికేయులను ఏకం చేస్తూ 2010లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్‌ను, ఆ తర్వాత 2014 జూన్ 12న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ను స్థాపించి 33 జిల్లాలకు విస్తరించారు.

ముఖ్య పోరాటాలు:-జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులు, బీమా,పింఛన్లు, పాత్రికేయ స్వేచ్ఛ,రక్షణ కోసం మూడు దశాబ్దాలుగా నిరంతర పోరాటాలు సాగించారు.

అందుకున్న ప్రతిష్ఠాత్మక పురస్కారాలు: గౌరవ డాక్టరేట్ (2020) గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుండి డాక్టర్ ఆఫ్ జర్నలిజం'★ పట్టా రాష్ట్రస్థాయి అవార్డులు:పాత్రికేయ శిరోమణి పురస్కారం'(2019)పాత్రికేయ సేవా రత్న పురస్కారం,నల్లగొండ జిల్లాలో ఉగాది శ్రేష్ఠ పాత్రికేయ పురస్కారం (2026)'

జాతీయ పురస్కారం:సామాజిక బాధ్యత గల జర్నలిజానికి గాను జాతీయ స్థాయి 'స్కెస్ అవార్డు 60 ఏళ్ల జీవన ప్రస్థానాన్ని, 30 ఏళ్ల ఉద్యమ ప్రయాణాన్ని పూర్తి చేసుకుని 61వ వసంతంలోకి అడుగుపెడుతున్న మామిడి సోమయ్యకు ఖమ్మం జిల్లా టీడబ్ల్యూజెఎఫ్ ( హెచ్-2843), అధ్యక్షులు నానబాల రామకృష్ణ,ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్,కోశాధికారి వేములకొండ రమేష్,స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్ల రాకేష్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ ,మామిడాల కిరణ్,టీబీజేఎ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్,వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని,టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్,టీబీజేఎ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్ ,సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు మొగలి నాగేశ్వరరావు,పులిపాటి పాపారావు, ఫెడరేషన్ సభ్యులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ,భవిష్యత్తులో కూడా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## నిరంతరం విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం




**నేలకొండపల్లి, జూన్ 7 ప్రజాజ్యోతి :** నిరంతరం విద్యుత్ ను సరఫరా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండలం లోని కొత్తకొత్తూరు లో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కెవీ విద్యుత్ ట్రాన్సఫార్మర్ ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రతీ పల్లెలో విద్యుత్ వెలుగులు అందించేందుకు ప్రభుత్వం అధనంగా / ట్రాన్స్ ఫార్మర్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్యుత్ మరియు అంతరాయం లేకుండా అందించేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ను అనేక మంది పేదలు లబ్ధిపొందుతున్నారని అన్నారు. గత పాలకుల వలన చీకట్లో బ్రతుకులు వెళ్లదీశారని పేర్కొన్నారు. ఆర్థిక భారమైనప్పటికీ ఉచిత విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం సంకల్పంచిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాళోత్ కవిత, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, వార్డు సభ్యులు బొల్లగాని వెంకటరామారావు, గుగులోత్ వెంకటి, ఠాగూర్సింగ్, గ్రామ పెద్దలు మాలోత్ అయోధ్య, రామయ్య, జ్యోతిబస్సు, వల్లాల కృష్ణ, కోటేశ్వరరావు, చావా వెంకటేశ్వరరావు, రవి, హనుమా, కాకామాను మల్లిఖార్జునావు, మూడు రమేష్, సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ లో నిర్లక్ష్యం తగదు



- అర్వాత కలిగిన ప్రతీ ఓటరు జాబితాలో ఉండాల్సిందే

**నేలకొండపల్లి, జూన్ 7 ప్రజా జ్యోతి :** ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమ అమలు లో ఎలాంటి నిర్లక్ష్యం తగదని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం బీఎల్వో లకు సర్ కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రాజేశ్వరపురం లోని సర్ కార్యక్రమం ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు సర్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. బీఎల్ఎ లు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పూరించి సేకరించాలని సూచించారు. వలసలు, మరణించిన, డబుల్ ఓటర్ల తొలిగింపు కోసమే తప్పా...అర్హులను తొలిగించేందుకు ఎంత మాత్రం కాదని సృష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతీ ఓటరు పేరు జాబితాలో ఉంటుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు గుర్తింపు కు మాత్రమే పరిగణించాలని, పుట్టిన తేది నిర్ధారణ కు ఇతర పత్రాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్స్ ఆలస్యం మధుసూధన్రావు, అల్లం రవికుమార్ పాల్గొన్నారు.

## బోనాల సందడి...!




**నేలకొండపల్లి, జూన్ 7 ప్రజా జ్యోతి :** మండలం లోని వివిధ గ్రామాలలో అదివారం బోనాల సందడి నెలకొంది. మండలం లోని ఆచార్లగూడెం లో గంగమ్మ తల్లి దైవం కు బోనాల పండగ ను నిర్వహించారు. గ్రామం లో మహిళలు బోనాలను ఎత్తుకుని ప్రదర్శన నిర్వహించారు. దేవాలయం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆటా, పాటలతో సందండి చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు లిక్కి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. మండలం లోని రాయగూడెం లో బొడ్రాయి వద్ద బోనాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిన వేణు, సోసైటీ చైర్మన్ తీగ రమణయ్య పాల్గొన్నారు.

## నిశ్చయతాంబులాల వేడుకకు హాజరైన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు



**నేలకొండపల్లి, జూన్ 7 ప్రజా జ్యోతి :** నేలకొండపల్లి మండల కేంద్రంలోని కొరట్లగూడెం గ్రామం లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగుల్ పాషా & హుస్సేన్ బిగార్ల దంపతుల కుమార్తె నిశ్చయతాంబులాల వేడుకకు ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూర నాగరాజు హాజరై హసీనా ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కోరట్లగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బారావు, షేక్ లాల్ పాషా, షేక్ మహబూబ్ పాషా ,గడిపల్లి నవీన్ , షేక్ సోహేల్ తదితరులు పాల్గొన్నారు

# వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

## జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

- వర్షాలు ఆలస్యమైతే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేయాలి
- గ్రామసభల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రస్తుతం వాతావరణ శాఖ అంచనాల ప్రకారం 2026 వానాకాలంలో ఎల్  నినో ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లావ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల వనరుల శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు .వర్ష పాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. జూలై 15 వరకు వర్షాలు పడకపోతే సాగు చేయవలసిన పంటలు, జూలై 30 వరకు వర్షాలు ఆలస్యమైతే చేపట్టాల్సిన పంటల ప్రణాళిక, అలాగే ఆగస్టు 15 వరకు వర్షపాతం నమోదుకాకపోతే సాగు చేయాల్సిన పంటలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో వరి సాగు చేసే రైతులు సంప్రదాయ నాటు విధానానికి బదులుగా వెదజల్లే పద్ధతిని అనుసరించాలని సూచించారు.స్వల్పకాలిక వరి రకాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048,డబ్ల్యూజీఎల్-44,జేజీఎల్-1978ఎంటీయూ-1010,జైశ్రీరామ్, హెచ్ఎంటీ సోనా వంటి రకాలను సాగు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగు విస్తీర్ణం తగ్గిన పక్షంలో వాటి స్థానంలో పెసర, మినుము, బొబ్బర, కంది, వేరుశనగ వంటి పంటలను సాగు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన పెసర విత్తనాలను ఆత్మనిర్భరత మిషన్ పథకం క్రింద రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పత్తి సాగు చేసే రైతులు తొందరపడి విత్తనాలు వేయవద్దని, భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని సూచించారు.కనీసం 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే పత్తివిత్తనాలు వేయడం మంచిదని, జూలై 15 వరకు పత్తి సాగుకు అనుకూల సమయం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

# చాప కింద నీరులా బీపీ, షుగర్ వ్యాధులు

- ప్రతి నలుగురిలో ఒకరికి బిపీ, ఐదుగురిలో ఒకరికి షుగర్
- ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్యులు టి పవన్ కుమార్
- బత్తినేని ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య క్యాంపులు
- 69వ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపు విజయవంతం



**బోనకల్, జూన్ 7 (ప్రజా జ్యోతి):** బిపి ,షుగర్ వ్యాధులు చాప కింద నీరులా వ్యాపిస్తున్నాయని, ప్రతి నలుగురిలో ఒకరికి బిపీ, 30 ఏళ్లు నిండిన ప్రతి ఐదుగురిలో ఒకరికి షుగర్ వ్యాప్తిస్తుందని ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్యులు టి పవన్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని తూము ప్రకాశ రావు భవన్లో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల మొదటి అదివారం నిర్వహించే బిపి, షుగర్ ప్రత్యేక 69వ క్యాంపు అదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యులు టి పవన్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుతం అనారోగ్యం బారిన పడే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోందని, తినే ఆహారం, మానసిక ఒత్తిళ్లు, ఆర్థిక ఇబ్బందులు, నిద్రలేమి, సరైన వ్యాయామం లేకపోవడం తదితర కారణాల వల్ల అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు. ఇక ఎక్కువగా బిపీ, షుగర్లు చాపకింద నీరులా వ్యాప్తిస్తున్నాయని, గతంలో పట్టణాల్లో ఎక్కువగా కనిపించే ఈ జబ్బులు ఇప్పుడు పల్లెలోనూ వ్యాపిస్తున్నాయ అన్నారు. గ్రామాల్లో 26 శాతం మంది, పట్టణాల్లో 30 శాతం మంది బిపి బాధితులు, పల్లెలో 19 శాతం మంది, పట్టణాల్లో 24 శాతం షుగర్ బాధితులున్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. బారీ స్థాయిలో బీపీ, షుగర్ బాధితులుండటం అత్యంత ఆందోళన కలిగించే అంశమని ఆందోళన వ్యక్తం చేశారు. అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యంతో మరి కొందరు ఈ రెండు ప్రమాదకర జబ్బులను నియంత్రణలో ఉంచుకోలేక గుండె జబ్బుల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనంద రావు, మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, టిడిపి నాయకులు దుగ్గి భద్రయ్య, గొల్లపల్లి కృష్ణారావు, క్యాంపు సహాయకులు యంగల గిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# మహిళాభ్యున్నతికై అంబేద్కర్ కృషిని కొనసాగిద్దాం

- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు



**బోనకల్, జూన్ 7 (ప్రజా జ్యోతి):** మహిళల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చేసిన కృషిని అభ్యుదయ వాదులు కొనసాగించాలని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం స్థానిక సి.పి.ఎం కార్యాలయంలో మహిళాభ్యున్నతి – అంబేద్కర్ కృషి అనే అంశంపై స్టడీ సర్కిల్ జరిగింది. కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అంబేద్కర్ ప్రపంచ మేధావి, సామాజిక శాస్త్రవేత్త కాగా కేవలం దళిత నాయకుడిగా చూస్తూ దళిత వాడల్లో ఆయన విగ్రహాలు పెట్టడం తప్పన్నారు. అంబేద్కర్ అంటే రిజర్వేషన్ మాత్రమే గుర్తుకు రావడం అంటే ఆయనను సంపూర్ణంగా అధ్యయనం చేయకపోవడం వల్ల జరిగే లోపం అన్నారు. జాతీయ నేతల్లో సమగ్ర దేశాభివృద్ధి, అణచివేత, పీడన, మూఢత్వం, అసమానతలన్నింటిపైనా తనదైనశైలిలో పరిష్కారాలు సూచించిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. ఓ సమాజం ఎంతగా అభివృద్ధి చెందింది అన్నది ఆ సమాజంలో స్త్రీల పరిస్థితిని బట్టి అంచనా వేయాలన్న మేధావి అంబేద్కర్ అన్నారు. స్త్రీలు హక్కులు, అభ్యున్నతి కోసం పరిష్కారం చెప్పడమే కాకుండా హిందూ కోడ్ బిల్లు రూపొందించారని గుర్తు చేశారు. ఆ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందనందున నిరసనగా న్యాయశాఖ మంత్రి పదవికి ఏకంగా రాజీనామా చేసిన ధీశాలి అన్నారు. ప్రపంచ పార్లమెంటరీ చరిత్రలో ఇది అరుదైన ఘట్టం అన్నారు.మహిళా విద్య, రాజకీయ, ఆర్థిక అవకాశాలు, సమాన పని, వేతనాలు, ప్రసూతి సెలవులు, గర్భిణీ స్త్రీలకు రక్షణ, ఆస్తి హక్కు, వారసత్వపు హక్కు, దత్తత హక్కు, సమాన గౌరవం కోసం చట్టాలు రూపొందించి పార్లమెంట్ లో వాటి ఆమోదం కోసం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ కు భారత దేశంలో మహిళలు ఋణపడి ఉంటారన్నారు. బోధించు-సమీకరించు-పోరాడు అన్న అంబేద్కర్ పిలుపు వింటే కేవలం దళితుల కోసం మాత్రమే కాకుండా భారత దేశం సమగ్ర అభివృద్ధి కోసం అంబేద్కర్ సూచించిన విషయాల్లో యువత, మహిళలు ముందుండి పోరాడాలన్నారు. మహిళలు చదువుకుని చైతన్యం పొంది పోరాటాల్లో భాగస్వామ్యం వహిస్తే మెరుగైన సమాజం ఏర్పడడం ఖాయమని తెలిపారు. చదువుకున్న తల్లి పిల్లల పెంపకంలో ఆడా,మగా సమానంగా పెంచుతుందని, బానిస, మత ఛాందస భావాలను మెదళ్ళకు నుండి సమూలంగా ప్రక్షాళన చేసి సమగ్రంగా, చైతన్యవంతంగా ఆలోచింపజేసే భావి భారత పౌరులను తయారు చేయగలుగుతుంది న్నారు. మత ఛాందసం, పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే టీవీ సీరియల్స్ వల్ల మహిళలే మహిళలకు శత్రువులన్నట్లు పరిస్థితి ఉందన్నారు. మహిళలు చైతన్యం పెంచుకుని అభ్యుదయ శక్తులతో కలిసి సమాజంలో మత ఛాందసం, మూఢత్వం, మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు సంపూర్ణంగా చెక్ పెట్టేందుకు పోరాటాలలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మధిర డివిజన్ అధ్యక్షులు జొన్నలగడ్డ సునీత, కృష్ణవేణి, సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం మధిర డివిజన్ కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, సిఐటియు మండల నాయకులు గుగులోత్ నరేష్, బూర్గుల అప్పాచారి, కుక్కల కోటేశ్వరరావు, బొప్పాల రమేష్, అజెయ్ కుమార్, జయరాజ్, ఏసుపోగు బాబు పాల్గొన్నారు.



# కళ్యాణపు వెంకటేశ్వరరావు ఇంట ఉప్పలమ్మ పూజ

## హాజరైన డాక్టర్ ఎమ్మెల్యే రాగమయి దంపతులు



**కల్లూరు జూన్ 07 ప్రజా జ్యోతి** కల్లూరు పట్టణం పడమర లోకారం కాంగ్రెస్ నాయకులు కళ్యాణపు వెంకటేశ్వరరావు నివాసంలో నిర్వహించిన ఉప్పలమ్మ పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ విజయ్ కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజా ప్రభాకర్, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రు అర్జున్ రావు హాజరయ్యారు. కల్లూరు పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఉప్పలమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు వృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావడంతో పూజా కార్యక్రమం కోలాహలంగా సాగింది.